క్లుప్తంగా

ఇస్కాన్‌లో చిత్రలేఖన పోటీలు



చిత్రలేఖన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

సీటీఆర్‌ఐ: కృష్ణాష్టమిని పురస్కరించుకుని స్థానిక ఇస్కాన్ టెంపుల్‌లో శుక్రవారం విద్యార్థులకు చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. రాముడు, కృష్ణుడు, దశావతారాలు వంటి చిత్రాలను విద్యార్థులు అద్భుతంగా గీశారు. చిత్రలేఖన పోటీలో 1,800 మంది, వాల్మీకి మహర్షి కథపై వ్యాసరచన పోటీలో 550 మంది పాల్గొన్నారు. ఈ నెల 16న కృష్ణాష్టమి సందర్భంగా విజేతలకు బహుమతులను అందజేయనున్నారు. ఆలయ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు.

ఉత్సాహంగా విలువిద్య పోటీలు



విలువిద్య పోటీల్లో పాల్గొన్న ఆర్చర్లు

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక కవలగొయ్యి రోడ్డులోని ఫ్యూచర్ కిడ్స్ గ్లోబల్ స్కూల్‌లో శుక్రవారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జోనల్ స్థాయి విలువిద్య పోటీలు ఉత్సాహంగా జరిగాయి. తెలుగు రాష్ట్రాలకు చెందిన 70 మంది ఆర్చర్లు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఆరు జోన్లకు చెందిన ఆర్చర్లు అండర్-14, 17, 19 బాలురు, బాలికల విభాగంలో రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ విభాగాల్లో పాల్గొని ప్రతిభ చాటారు. విజేతలను పాఠశాల డైరెక్టర్ రవి బాబు యేలేటి, సీఈఓ శ్రీమహస్వి, ప్రిన్సిపాల్, క్రీడా సమన్వయకర్త శేషగిరిధర్ తదితరులు అభినందించారు.

అమరవీరులకు నివాళి

రాజమహేంద్రవరం సిటీ: భారత సైనికులు కార్గిల్ యుద్ధంలో పాకిస్తాన్ ఉగ్రమూకలను తరిమికొట్టి ఘన విజయాన్ని సాధించారని ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం లాలాచెరువు జంక్షన్ కార్గిల్ సెంటర్‌లో కార్గిల్ యుద్ధంలో అమరవీరులైన సైనికులను స్మరించుకుంటూ నివాళి అర్పించారు. మద్దిపాటి రజిని, అడబాల రామకృష్ణ, పేరిచర్ల సూర్యప్రభ పాల్గొన్నారు.

పక్కాగా ఆడిట్ నిర్వహించాలి



ఆడిట్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ మూర్తి

కడియం: మండల, గ్రామ మహిళా సమాఖ్యల ఆడిట్‌ను పక్కాగా నిర్వహించాలని డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి ఆదేశించారు. మండలంలో జరుగుతున్న ఆడిట్ తీరును శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. సంఘాలకు పుస్తక నిర్వహణ ప్రాణం లాంటిదన్నారు. వాటిని సక్రమంగా నిర్వహించాలని, నిధుల రికవరీ, లావాదేవీల తీరును పరిశీలిస్తే గ్రామ సంఘాలు లాభాల్లో ఉందో? నష్టాల్లో ఉందో తెలుస్తుందన్నారు. ప్రతి సంఘానికి ఆడిట్ నిర్వహించి నివేదికను సెర్ప్‌కి పంపిస్తామని ఆయన తెలిపారు. ఆడిటర్ జయచంద్ర, డీపీఎం (ఫైనాన్స్) ఎం.శ్రీనివాసరావు, ఏపీఎం ఎ.నాగలక్ష్మి, సీసీలు తిలక్, నాగభూషణం, నాగేశ్వరరావు, వివిధ గ్రామాల వీఏఓలు, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల:	హరిహరవీరమల్లు
సూర్యమినీ:	మహావతార్, నరసింహ
సూర్యప్యాలెస్:	హరిహరవీరమల్లు
స్వామి:	హరిహరవీరమల్లు
అనుశ్రీ:	హరిహరవీరమల్లు
శివజ్యోతి:	హరిహరవీరమల్లు
రాజా:	హరిహరవీరమల్లు
ఊర్వశి:	హరిహరవీరమల్లు
రంభ:	దిఫెంటాస్టిక్‌ఫోర్
మేనక:	ఎఫ్-1 దిమూవీ
అప్సర:	హరిహరవీరమల్లు
అశోక:	జూనియర్

నామవరం

వీఎస్.మహల్:	హరిహరవీరమల్లు

ధవళేశ్వరం

మురళీకృష్ణ:	హరిహరవీరమల్లు

కడియం

వెంకటసూర్య:	హరిహరవీరమల్లు

క్రీడా వేదిక... కీర్తి పతాక

- రాష్ట్ర, జిల్లా పోటీలకు వేదికగా నగరం
- ఆయా పోటీల్లో మన క్రీడాకారుల సత్తా



మున్సిపల్ కాలనీ క్రికెట్ గ్రౌండ్‌లో సీజన్- 17 క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు



అథ్లెట్ కమిషన్ సభ్యురాలిగా నియామక పత్రం అందుకుంటున్న లలితాదేవి

ప్రకాశం నగర్: రాజమహేంద్రవరం... ఈ పేరు వినగానే అందరికీ గుర్తొచ్చేది సంస్కృతిక రాజధాని అని.. ఇప్పుడు క్రీడలకు, క్రీడాకారులకు వేదిక అవుతోంది. నగరంలో ప్రధానంగా రాష్ట్ర స్థాయి పోటీలతో పాటు పలు జిల్లా, ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించడంతో కీర్తి పతాకం ఎగురవేస్తోంది. ఇక్కడి నుంచి అనేకమంది క్రీడాకారులు సత్తా చాటుతుండడం విశేషం.. ఇటీవల ఉమ్మడి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. దీనికి హుకుంపేట బొప్పన స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని గోల్డెన్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీ వేదికైంది. తూర్పుగోదావరి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ 11, 13, 15, 17, 19 బాలురు, బాలికల విభాగంతో పాటు మాస్టర్స్ మెన్, ఉమెన్ విభాగంలో 35 ప్లస్, 40 ప్లస్, 50 ప్లస్, 55 ప్లస్, 60 ప్లస్, 65 ప్లస్, 70 ప్లస్, 75 ప్లస్ సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించారు. అలాగే మున్సిపల్ కాలనీ క్రికెట్ గ్రౌండ్‌లో సీజన్- 17 క్రికెట్ టోర్నమెంట్‌ను సుమారు 12 రోజుల పాటు నిర్వహించారు. ఈ సీజన్‌లో మొత్తం పది జట్లు పాల్గొనగా, ఇందులో ఎస్ లెవన్ జట్టు విజేతగా, ఐసి వారియర్స్ ద్వితీయ స్థానంలో నిలిచాయి. ఇలా అనేక పోటీలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. మూడు రోజుల నుంచి భారత్ రైజింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక లాలాచెరువు పోలీస్ గ్రౌండ్‌లో మాస్టర్స్ కప్ క్రికెట్ టోర్నీ (40 ఏళ్ల విభాగంలో) జరుగుతుది. సీజన్-1లో మొత్తం 8 రోజుల పాటు జరుగుతున్న ఈ క్రీడా పోటీల్లో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి క్రీడాకారులు తలపడుతున్నారు. గత ఏడాది జూలైలో రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు స్థానిక నారాయణపురంలోని ఆర్ఎమ్‌సీ సిటీ బ్యాడ్మింటన్ కోర్టులో జరిగాయి. నగరంలోని చెరుకూరి కన్వెన్షన్‌లో రాష్ట్ర స్థాయి ఉస్సు పోటీలు నిర్వహించారు.

సాధనకు సౌకర్యం లేక..

ఇక్కడ వరకూ బాగానే ఉన్నా క్రీడాకారుల సాధనకు సరైన క్రీడా మైదానాలు నగరంలో కరవయ్యాయి. ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానం, స్టేడియం, ఎస్‌కేవీటీ క్రీడా మైదానాలు ఉన్నా సౌకర్యాల కల్పన మాత్రం అంతంత మాత్రంగానే ఉంటుందని క్రీడాకారులు అంటున్నారు. ఇప్పటికైనా నగర పాలకులు, అధికారులు స్పందించి క్రీడా మైదానాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గత ప్రభుత్వంలో స్కూల్ గేమ్స్, ఆడుదాం- ఆంధ్ర పేరుతో క్రీడా పోటీలను నిర్వహించి గ్రామీణ క్రీడాకారులను గుర్తించి వారికి మెరుగైన శిక్షణ ఇచ్చారు. ఈ చర్యలతో క్రీడాకారుల్లో ప్రతిభకు పదును పెట్టినట్లు అయ్యింది. ప్రసుత్త కూటమి ప్రభుత్వంలో క్రీడల ఊసే లేకపోవడంతో పలువురు పెదవి విరుస్తున్నారు.

అథ్లెట్ కమిషన్ సభ్యురాలిగా లలితాదేవి

వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అథ్లెట్ కమిషన్ సభ్యురాలిగా నగరానికి చెందిన బీచ్ వాలీబాల్ జాతీయ క్రీడాకారిణి యండమూరి లలితాదేవి ఎన్నికయ్యారు. ఈ నెల 21న జైపూర్‌లో వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంస్థ నిర్వహించిన ఓటింగ్ ద్వారా లలితాదేవి భారీ మెజార్టీతో విజయం సాధించింది. యావత్ భారత్ దేశం మీద నలుగురు క్రీడాకారిణులు ఓటింగ్ పద్ధతిలో కమిషన్ సభ్యురాలిని ఎన్నుకోగా వారిలో నగరానికి చెందిన లలితాదేవి ఉండడం ఎంతో గర్వించదగ్గ విషయం.

క్రీడా మైదానాలను అభివృద్ధి చేయాలి

నగరంలో క్రీడాకారుల కోసం మైదానాలను అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఉంది. స్కూల్ గేమ్స్‌లో భాగంగా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి క్రీడాకారులు వస్తుంటారు. జిల్లా కేంద్రంగా ఉన్న రాజమహేంద్రవరంలో క్రీడా మైదానాల ఏర్పాటుతో పాటు క్రీడాకారులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– నాగేంద్ర, మాజీ శాప్ డైరెక్టర్

కొనసాగిన కార్మికుల సమ్మె



ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న సత్యసాయి ప్రాజెక్టు కార్మికులు

రాజమహేంద్రవరం రూరల్: లాలాచెరువు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయం వద్ద శ్రీసత్యసాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు కార్మికుల సమ్మె శుక్రవారంతో 18వ రోజుకు చేరుకుంది. కార్మికులకు 19 నెలలుగా జీతాలు, 25 నెలలుగా పీఎఫ్, ఈఎస్‌ఐ కట్టడంతో పాటు ఇతర డిమాండ్‌లు నెరవేర్చాలని యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రాజు, ఇసాక్ కోరారు. కార్మికులు జీతాలు లేక అలమటిస్తుంటే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, కాంట్రాక్టర్ స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కార్మికులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

నేడు అంతరిక్ష అవగాహన కార్యక్రమం

కంబాలచెరువు: శాటిలైట్ సిటీలోని మండల ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతరిక్ష అవగాహన కార్యక్రమం జరుగుతుందని జిల్లా సైన్స్ అధికారి నెహ్రూ శుక్రవారం తెలిపారు. ఇస్రో ప్రయోగాలు, ఉపగ్రహాలు, పలు మిషన్లపై ప్రదర్శనలు, స్పేస్ మోడల్స్, వీడియో ప్రదర్శనలు, ఇంటరాక్టివ్ సెషన్లు, కెరీర్ టాక్స్, సైన్స్ సిటీ నుంచి రిసోర్స్ పర్సన్ల ప్రత్యేక ఉపన్యాసాలు, ఆసక్తికరమైన స్పేస్ క్విజ్, గేమ్స్, హ్యాండ్స్ ఆన్ యాక్టివిటీస్ సర్టిఫికెట్లు, గుర్తింపు వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు.

'కారం తమ్మనదొర' జిల్లా ఏర్పాటు చేయాలి

ఆదివాసీ మహాసభ డిమాండ్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సూర్యనారాయణ తదితరులు

సీటీఆర్‌ఐ: రంపచోడవరం కేంద్రంగా తొలి మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు కారం తమ్మన్నదొర పేరుపై జిల్లా ఏర్పాటు చేయాలని ఆదివాసీ మహాసభ అధ్యక్షుడు మిడియం వెంకటస్వామి, కుంజం వెంకటరమణమ్మ, న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. కారం తమ్మన్నదొర, కారుకొండ సుబ్బారెడ్డిల అనుచరుల వివరాలను ప్రభుత్వం వెంటనే సేకరించి ప్రచురించాలని, వారి కుటుంబాలకు తగిన గుర్తింపు ఇవ్వాలని వారు కోరారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆదివాసీ స్వాతంత్ర్య సమరయోధుల వివరాలు సేకరించాలని ప్రచురించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఐనాపురపు సూర్యనారాయణ మాట్లాడుతూ భారతదేశంలో 1857 సిపాయిల తిరుగుబాటుకు ముందే బ్రిటిష్ వారిపై ఆంధ్రా ప్రాంతంలోని రంపచోడవరం కేంద్రంగా రంప తిరుగు బాటు 1839 నుంచి 1848 వరకూ జరిగిందని, దీనికి రంపచోడవరం మండలం బందపల్లికి చెందిన కోయ ముఠాదారు కారం తమ్మన్నదొర నాయకత్వం వహించారని చెప్పారు. 1880వ సంవత్సరం 25 జూలైలో కారం తమ్మన్నదొర బ్రిటిష్ వారితో జరిగిన ఒక పోరాటంలో చనిపోయారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు జగ్గంపేట సభలో ఇచ్చిన హామీ మేరకు రంపచోడవరం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేసి, కారం తమ్మనదొర పేరు పెట్టాలని, అలాగే కేఆర్ పురం ఐటీడీఏకు కారుకొండ సుబ్బారెడ్డి పేరును పెట్టాలని అన్నారు. ఆగస్టు 15వ తేదీలోగా ఈ వీరుల వివరాలు ప్రభుత్వం సేకరించాలని కోరారు. సమావేశంలో టి.సాయిపుష్ప, ముచ్చిక భాస్కర్ కృష్ణంరాజు, దొర, సోమాల దుర్గాప్రసాద్, సోడే పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న రిజర్వ్ బ్యాంక్ జీఎం మహాన

కడియం: ఆర్థిక అక్షరాస్యతపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జీఎం ఎ.మహాన అన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిట్స్ ఎడ్యుకేషన్, అవేర్‌నెస్ ఫండ్ కార్యక్రమం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం వేమగిరిలో మెగా ఆర్థిక అక్షరాస్యతా కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జీఎం మహాన మాట్లాడుతూ పీఎఫ్, జన్‌ధన్ ఖాతాలు, రూపే ఏటీఎం కార్డులు, నామినేషన్ సౌకర్యాలను కలిగి ఉందని, ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. యూనియన్ బ్యాంకు డిప్యూటీ రీజినల్ హెడ్ రత్నకుమారి మాట్లాడుతూ జనసురక్షలో సామాజిక భద్రతా పథకాలైన ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన్‌లో ప్రతి ఒక్కరూ నమోదు కావాలన్నారు. సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫార్మేషన్ డైరెక్టర్ వి.ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంకింగ్ సేవలు వినియోగించుకోవాలని, బ్యాంక్ యాప్, క్యూ ఆర్ కోడ్ వంటి వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఎల్‌డీఓ నవీన్, యూనియన్ బ్యాంక్ ఎఫ్‌ఐ ఆఫీసర్ గోపాల్, వేమగిరి బ్రాంచ్ మేనేజర్ వంశీ, ఆర్థిక అక్షరాస్యతా కేంద్రాల ప్రతినిధులు హరి, అనిల్, చిట్టితల్లి, జ్యోతి, కడియం ఏపీఎం నాగలక్ష్మి పాల్గొన్నారు.

శ్రావణం... శుభకరం





దేవీచౌక్ బాలా త్రిపురసుందరి అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకుడు, దేవీచౌక్ వద్ద విద్యుత్ అలంకరణ

తొలి శుక్రవారం పూజలకు పోటెత్తిన భక్తులు

సీటీఆర్‌ఐ: శుభకరమైన శ్రావణమాసం రానే వచ్చింది.. అందులో తొలి శుక్రవారం కావడంతో అమ్మవార్ల ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. హిందువులకు అత్యంత శుభప్రదమైన మాసం కావడంతో ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే నగరంలోని గోదావరి ఘాట్‌ల వద్ద రద్దీ నెలకొంది. పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చిన భక్తులతో కిక్కిరిసింది. రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో వేంచేసిన శ్రీబాలా త్రిపుర సుందరీదేవి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ఇక్కడ మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక వంకాయల వారి వీధిలోని వరలక్ష్మీ దేవాలయం, అష్టలక్ష్మీ దేవాలయాలను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా అమ్మవార్ల ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. గాదాలలో వేంచేసిన గుడ్లగూబ సమేత శ్రీమహాలక్ష్మి దేవి ఆలయం ప్రత్యేక శోభను సంతరించుకుంది. రాష్ట్రంలోనే మొట్టమొదటి 27 నక్షత్ర మండలి, 12 రాసుల కూటమితో నిర్మించిన దేవాలయం కాగా ఇక్కడ భక్తులు స్వయంగా అమ్మవారికి అభిషేకం చేయడం విశేషం.

అదృశ్యమైన యువతి ఆచూకీ లభ్యం

సీతానగరం: అదృశ్యమైన ఓ యువతి ఆచూకీ కనుగొని తల్లిదండ్రులకు అప్పగించామని ఎస్సై డి.రామ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.. చినకొండేపూడికి చెందిన ఓ యువతిని తల్లి మందలించడంతో ఈ నెల 23న కళాశాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో తండ్రి ఫిర్యాదు చేశారు. గౌరీపట్నం ఆలయంలో ఉందని తెలుసుకుని, కొన్ని గంటల్లోనే యువతిని తల్లిదండ్రులకు ఎస్సై అప్పగించారు.

పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఏడీసీ రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని ప్రతి డివిజన్‌లో పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఆనంద్‌నగర్ పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. 46వ డివిజన్‌లోని పలు వీధుల్లో శానిటేషన్, సైడ్ డ్రైన్ల నిర్వహణ విధానాన్ని పరిశీలించి సిబ్బందికి పలు ఆదేశాలిచ్చారు. రోడ్లపై వ్యర్థాలు ఉండటానికి వీల్లేదని అన్నారు. మురుగు నీరు నిల్వ ఉన్న చోట్ల దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. ఇంటింటికీ చెత్త సేకరణ నూరుశాతం జరగాలన్నారు. నగరంలోని ప్రతి ఒక్కరికీ ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా నగరపాలక సంస్థ ముందుకు వెళుతున్నట్లు తెలిపారు.

పారాలీగల్ వలంటీర్లకు శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ ప్రధాన న్యాయమూర్తి మాధురి

కంబాలచెరువు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పారాలీగల్ వలంటీర్లకు రెండు రోజుల పాటు జరిగే ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. స్థానిక కోర్టు ప్రాంగణంలో జరిగిన శిక్షణకు ముఖ్య అతిథిగా జిల్లా ఇన్‌చార్జ్ ప్రధాన న్యాయమూర్తి ఎం.మాధురి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ భారత న్యాయ సేవాధికార సంస్థ మార్గదర్శకాల మేరకు పారా లీగల్ వలంటీర్లు ఉచిత న్యాయం, లోక్ అదాలత్‌లు, లీగల్ అవేర్‌నెస్ క్యాంపులు, ఉచిత న్యాయ సలహా వంటి సేవలందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. మారుమూల ప్రాంతాల్లో కనీస రవాణా సదుపాయాలు లేక ప్రజలు న్యాయ సహాయం పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అటువంటి వారికి న్యాయ సేవలు అందించే బాధ్యత పారా లీగల్ వలంటీర్లపై ఉందన్నారు. పారా లీగల్ వలంటీర్లు ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ముందుండాలన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని సుమారు వందమంది పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

జిప్ మ్యాట్ ఫలితాల్లో విద్యార్థి ప్రతిభ



విద్యార్థి రిహాన్‌ఖాన్‌ను అభినందిస్తున్న విద్యా సంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే జిప్ మ్యాట్ ఫలితాల్లో శ్రీషిర్డీసాయి జూనియర్ కళాశాల విద్యార్థి అత్యుత్తమ ర్యాంకు సాధించి ఐఐఎం బోధ్ గయలో ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్‌కు అర్హత సాధించినట్లు ఆ విద్యా సంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య శుక్రవారం తెలిపారు. తమ డాఫ్నీ సివిల్స్ అకాడమీలో శిక్షణ పొందిన ఎండీ రిహాన్‌ఖాన్ ఈ ఘనత సాధించినట్లు వివరించారు. ఐఐఎం బోధ్ గయలో కేవలం 120 సీట్లు మాత్రమే ఉండే ఐదేళ్ల ఈ కోర్సు (బీబీఏ+ఎమ్‌బీఏ)కు తమ విద్యార్థి ఎంపిక కావడంతో ఆ విద్యా సంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ హర్షం వ్యక్తం చేశారు. విజేతను, అందుకు కృషి చేసిన అధ్యాపక బృందాన్ని అభినందించారు.

వినూత్న రీతిలో మొండి బకాయిల వసూలు



రఘుదేవపురంలో రుణగ్రహీత ఇంటి వద్ద శాంతియుత నిరసన తెలుపుతున్న ఆర్‌టీపీఎం

సీతానగరం: డీసీసీ బ్యాంక్ శాఖలు, సహకార సంఘాల ద్వారా ఇచ్చిన కొన్ని రుణాలు వాయిదా మీరి నిర్ధారక ఆస్తులుగా మారడంతో మొండి బకాయిల వసూలను వినూత్న రీతిలో చేపట్టారు. నాబార్డు, ఆప్కాబ్ వారి సూచనల మేరకు రికవరీ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా డీసీసీబీ అధికారులు సహకార సంఘ సీఓలు, సిబ్బంది రికవరీ టాస్క్‌ఫోర్స్ పీస్ మిషన్ (ఆర్‌టీపీఎమ్) టీమ్‌లుగా ఏర్పడ్డారు. వీరు సీతానగరం మండలం రఘుదేవపురం డీసీసీబీ బ్రాంచ్ పరిధిలోని పలు గ్రామాల్లో మొండి బకాయిలను వినూత్న రీతిలో వసూలు చేస్తున్నారు. డీజీఎం ఎం.శ్రీధర్‌చౌదరి, ఏజీఎం పి.కృష్ణమోహన్, రఘుదేవపురం డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ ఎం.క్రాంతికృష్ణ తదితరుల ఆధ్వర్యంలో శుక్రవారం రఘుదేవపురంలో రికవరీ డ్రైవ్ నిర్వహించారు. 'నమ్మకంగా తీసుకున్న రుణం నిజాయితీగా చెల్లించండి' అనే తదితర ప్లకార్డులు చేతపట్టి రుణగ్రహీతల ఇంటి వద్దకు వెళ్లి శాంతియుతంగా నిరసన తెలిపి, బాకీ చెల్లించాలని కోరారు. డీజీఎం శ్రీధర్ చౌదరి మాట్లాడుతూ జిల్లాలో రూ.700 కోట్ల మొండి బకాయిలు ఉన్నాయని, వాటి వసూలుకు ఆర్టీపీఎం టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ క్రాంతికృష్ణ మాట్లాడుతూ బ్రాంచ్ పరిధిలో 12 పీఏసీఎస్‌లు ఉన్నాయని, సుమారు రూ.3 కోట్ల మొండి బకాయిలు ఉన్నాయన్నారు. రాపాక, రఘుదేవపురం, వంగలపూడి, వెదుళ్లపల్లి తదితర గ్రామాల్లో ఆర్‌టీపీఎమ్ టీమ్‌లు రుణగ్రహీతల ఇళ్ల వద్దకు వెళ్లి శాంతియుతంగా నిరసన తెలిపామన్నారు. ఇతర డీసీసీబీ బ్రాంచ్‌ల మేనేజర్లు టి.లక్ష్మితులసి తదితరులు పాల్గొన్నారు.

'నన్నయ' వీసీ ప్రసన్నశ్రీకి అభినందన



వీసీ ఆచార్య ప్రసన్నశ్రీని సన్మానిస్తున్న అధ్యాపకులు, సిబ్బంది

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి చెందిన బోధన, బోధనేతర సిబ్బంది దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. 19 గిరిజన భాషలకు లిపిని రూపొందించిన నేపథ్యంలో ఇటీవల ఆచార్య ఆర్.సుబ్బకృష్ణ స్మారక అవార్డును ఆమె అందుకోవడంతో ఈ సన్మానం చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.విజయనిర్మల, అధ్యాపకులు కె.రమణేశ్వరి, టి.హైమావతి, కె.దీప్తి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు చేయడం దారుణం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్ వెస్లీ

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ నేతలను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని, కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్ వెస్లీ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కొంతమూరులోని ఎంవీఎస్ ఫంక్షన్ హాల్లో వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎం.విజయసారధి అధ్యక్షతన మండల స్థాయి నాయకులతో రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో నాలుగో దశ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జాన్ వెస్లీ మాట్లాడుతూ అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం, వైఎస్సార్ సీపీ గుర్తుచేస్తేనే తప్ప పథకాలు అమలు చేసే పరిస్థితి లేదన్నారు. ప్రజల పక్షాన పోరాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించడం సరికాదని దుయ్యబట్టారు. క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయసారధి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా చంద్రబాబు చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. క్రైస్తవుల పట్ల వివక్ష చూపుతున్నారని, దీనిని అంతా తిప్పికొట్టాలన్నారు. ఆడబిడ్డ నిధి, రైతుభరోసా ఇంకా అనేక పథకాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. జిల్లాలో క్రైస్తవ నాయకులంతా రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసేందుకు కృషి చేయాలన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రవణ్‌కుమార్, రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల అధ్యక్షుడు బి.జోనాతన్, దావీదురాజులు మాట్లాడారు. మండల స్థాయి నాయకులు స్పర్శన్ రాజు, అబ్రహం శామ్యూల్, ప్రేమ్‌కుమార్, అలెగ్జాండర్ తదితరులు పాల్గొన్నారు.